# నూతన గనులను సాధించుకోవాలి

**కోలిండియా, సింగరేణిపై కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): వచ్చే రోజుల్లో ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించే విషయంలో ప్రభుత్వరంగ బొగ్గు సంస్థలు డిమాండ్‌కు తగినట్టుగా నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేసేలా సమాయత్తం కావాలని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బొగ్గు సంస్థల మనుగడకు కొత్త గనులను పెంచుకోవడం అత్యంత అవసరమని, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారా వినియోగదారులకు బొగ్గు అందుబాటులోకి తీసుకురావచ్చని, తద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి ప్రజలకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి కోలిండియా, సింగరేణి ఉన్నతాధికారులు హాజరయ్యారు. సింగరేణి సీఎండీ ఎన్ బలరాం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి సమీక్షలో పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంపెనీ ప్రగతి, భవిష్యత్తు ప్రణాళికలు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గింపు, నాణ్యత, సరఫరా తదితర అంశాల్లో ఎదురవుతున్న సవాళ్లు, వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పలు సూచనలు చేశారు. కార్మికుల జీతాలు, సంక్షేమ కార్యక్రమాలకు ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి ఖర్చు గణనీయంగా తగ్గించాలని సూచించారు. ఇందుకోసం కార్మిక సంఘాల సహకారాన్ని తీసుకోవాలని, పని సంస్కృతిని మెరుగుపరచాలని కోరారు.

### రహస్య పత్రాలను లీక్‌చేస్తే కఠిన చర్యలు

సింగరేణి సంస్థకు సంబంధించిన రహస్య సమాచారాన్ని బయటకు లీక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంస్థ డైరెక్టర్ (పీపీ అండ్ పర్సనల్) హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్ జారీచేశారు. కంపెనీ రహస్య పత్రాలు తమకు ఇవ్వాల్సిందిగా కొందరు వ్యక్తులు ఉద్యోగులను, అధికారులను బెదిరిస్తున్నట్టు, ఒత్తిడికి గురిచేస్తున్నట్టు తెలుస్తున్నదని, అలాంటి వ్యక్తులు ఏ స్థాయిలో ఉన్నా లెక్క చేయాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

# బ్యాంకింగ్ మోసాలు 36 వేల కోట్లు

**2024-25లో తగ్గిన ఫ్రాడ్.. నష్టాలు మూడింతలు**

**రిజర్వుబ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి**




ముంబై, మే 29: బ్యాంకింగ్‌లో మోసాలను నియంత్రించడానికి రిజర్వు బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. రుణ ఖాతాలు, డిజిటల్ చెల్లింపులకు సంబంధించి సంఖ్య పరంగా తగ్గినప్పటికి విలువ పరంగా చూస్తే మాత్రం మూడింతలు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ విడుదల చేసిన తన వార్షిక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.36,014 కోట్ల విలువైన మోసాలు జరిగాయని తెలిపింది. అంతక్రితం ఏడాది రూ.12,230 కోట్ల మోసాలు జరిగాయి. సంఖ్యపరంగా చూస్తే మాత్రం 2023-24లో 36,060 మోసాలు జరగగా, ఆ తర్వాతి ఏడాదికిగాను 23,953కి తగ్గాయి. ప్రధానంగా 122 కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు గడిచిన ఆర్థిక సంవత్సరంలో వర్గీకరించడం వల్లనే విలువ భారీగా పెరిగిందని తెలిపింది. బ్యాంకింగ్ మోసాల్లో డిజిటల్ పేమెంట్లు, కార్డు, ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా ఉన్నాయని పేర్కొంది. మొత్తం మోసాల్లో 60 శాతం మోసాలు ప్రైవేట్ రంగ బ్యాంకుల్లోనే జరిగాయని తెలిపింది. మొత్తం విలువల్లో వీటి వాటా 71 శాతంగా ఉన్నది. కార్డు/ఇంటర్నెట్ ద్వారా జరిగే మోసాలు అధికంగా 13,516గా నమోదయ్యాయి. మొత్తం 23,956 మోసాల్లో వీటి వాటా 56.5 శాతంగా ఉన్నది. లక్ష రూపాయల కంటే అధికంగా నమోదైన మోసాల గురించి ఆర్బీఐ వివరించింది.

### 25% పెరిగిన కరెన్సీ ప్రింటింగ్ ఖర్చులు

కరెన్సీ ప్రింటింగ్ కోసం పెట్టే రిజర్వు బ్యాంక్ గరిష్ఠ స్థాయిలో ఖర్చు చేస్తున్నది. గతేడాదికిగాను కరెన్సీల ప్రింటింగ్ కోసం రూ.6,372.8 కోట్ల నిధులను ఖర్చు చేసింది. అంతక్రితం ఏడాది ఖర్చు చేసిన రూ.5,101.4 కోట్లతో పోలిస్తే 25 శాతం పెరిగినట్టు తన వార్షిక నివేదికలో వెల్లడించింది. నోట్లు సంఖ్య ఆరు శాతం అధికం కాగా, విలువ పరంగా చూస్తే 5.6 శాతం పెరిగాయి. కరెన్సీ ప్రింటింగ్‌లో రూ.500 నోట్ 86 శాతం వాటా కలిగివున్నది. క్రితం ఏడాదితో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. అలాగే రూ.10 డినామినేషన్ బ్యాంక్ నోట్ వాటా 16.4 శాతంగా ఉన్నది. మొత్తం బ్యాంక్ నోట్ల సర్క్యులేషన్‌లో రూ.10, రూ.20, రూ.50 మొత్తంగా 31.7 శాతం వాటా కలిగివున్నది. రెండేండ్ల క్రితం రద్దు చేసిన రూ.2 వేల నోట్లలో ఇప్పటి వరకు 98.2 శాతం నోట్లు బ్యాంకుల వద్ద జమ అయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో రూ.2, 5, 10, 20, 50, 100, 200, 500 నోట్లు చలామణిలో ఉన్నాయి.

### బ్యాలెన్స్ షీట్ పెరుగుదల

రిజర్వు బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ ఏడాది ప్రాతిపదికన 8.20 శాతం ఎగబాకి రూ.76.25 లక్షల కోట్లకు చేరుకున్నది. నగదు నిల్వలు అత్యధికంగా ఉండటంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్..కేంద్ర ప్రభుత్వానికి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది. పసిడి ఆస్తులు 52.09 శాతం అధికమవగా, దేశీయ పెట్టుబడులు 14.32 శాతం, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్లు 1.70 శాతం అధికమయ్యాయి.



### పసిడి నిల్వలు హైజంప్

రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న పసిడి నిల్వలు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసిన వార్షిక నివేదికలో పసిడి విలువ ఏడాది ప్రాతిపదికన 57.12 శాతం ఎగబాకి రూ.4,31,624.8 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల బంగారాన్ని కొనుగోలు చేయడంతోపాటు ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే విలువ పెరిగిందని వెల్లడించింది. మార్చి 31, 2024 నాటికి గోల్డ్ రిజర్వులు రూ.2,74,714.27 కోట్లుగా ఉన్నది.


**ఆర్బీఐ నివేదికలో కీలక అంశాలు..**

- ముక్కలు చేసిన నోట్లతో కణ బోర్డులను తయారు చేస్తున్నారు.
- డిజిటల్ కరెన్సీ లావాదేవీలు రూ.1,016 కోట్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది రూ.234 కోట్లుగా ఉన్నాయి.
- ప్రస్తుతం రిజర్వుబ్యాంక్ వద్ద 879.58 మెట్రిక్ టన్నుల విలువైన గోల్డ్ రిజర్వులు ఉన్నాయి. అంతక్రితం ఏడాది 822.10 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.
- 311.38 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి ఆస్తులు కలిగివుండగా, మిగతా 568.20 మెట్రిక్ టన్నుల విలువైన పసిడి బ్యాంకింగ్ డిపార్ట్‌మెంట్ల వద్ద ఉన్నది.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో అదనంగా 54.13 మెట్రిక్ టన్నుల విలువైన పసిడిని కొనుగోలు చేసింది.

# చివరి అరగంటలో కొనుగోళ్లు

**320 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

ముంబై, మే 29: స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుపై అక్కడి కోర్టు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో దేశీయ సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. ఉదయం నుంచి తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు చివరి అరగంటలో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో భారీగా లాభపడ్డాయి. ఒక దశలో 500 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 320.70 పాయింట్లు అందుకొని 81,633.02 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 81.15 పాయింట్లు అందుకొని 24,833.60 వద్ద స్థిరపడింది. ప్రస్తుత నెలకుగాను డెరివేటివ్ కాంట్రాక్ట్ గడువు ముగియడంతో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫలితంగా మెటల్, రియల్టీ, ఫార్మా, ఐటీ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ మాజీ సీఈవో సుమంత్‌పై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిషేధం విధించడంతో ఈ బ్యాంక్ షేరు భారీగా లాభపడింది. ఇంట్రాడేలో 3 శాతానికి పైగా లాభపడిన బ్యాంక్ షేరు చివరకు 2.41 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, ఎటర్నల్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్‌లు కూడా లాభాల్లో ముగిశాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్ మాత్రం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే రియల్టీ 1.21 శాతం అధికమవగా, మెటల్, ఐటీ, సర్వీసెస్, టెక్నాలజీ, కమోడిటీస్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..ఎఫ్‌ఎంసీజీ రంగ షేరు నష్టపోయింది.



## అమర రాజా రూ.5.20 డివిడెండ్


హైదరాబాద్, మే 29: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.2,974 కోట్ల ఆదాయంపై రూ.224 కోట్ల పన్నులు చెల్లించకముందు నికర లాభాన్ని గడించింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.12,405 కోట్ల ఆదాయంపై రూ.1,299 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. దీంతో పాటు ప్రతిషేరుకు రూ.5.20 డివిడెండ్‌ను ప్రతిపాదించింది.

## పోకర్ణ లాభం మూడింతలు

హైదరాబాద్, మే 29: గ్రానైట్ తయారీ సంస్థ పోకర్ణ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.రూ.58.90 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది నమోదైన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. అలాగే ఆదా యం ఏడాది ప్రాతిదదిన 62.50 శాతం ఎగబాకి రూ.262.68 కోట్లుగా నమోదైంది. 2024-25కిగాను రూ.930.10 కోట్ల ఆదాయంపై రూ.187.54 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

# పసిడి కొనుగోళ్లకు ధరల షాక్

**2025-26లో 10 శాతం వరకు తగ్గనున్న డిమాండ్: ఇక్రా నివేదికలో వెల్లడి**



ముంబై, మే 29: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల కారణంగా బంగారు ఆభరణాల వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆభరణాల వినిమయం 9 శాతం నుంచి 10 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారం ధరలు 33 శాతం పెరగడం ఇందుకు కారణమని తెలిపింది. 2024-25లో కడ్డీల వినిమయం 17 శాతం, నాణేలు 25 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్లాయని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూపు హెడ్ జితిన్ మక్కర్ తెలిపారు. ఈ ఏడాది కడ్డీలు, నాణేల డిమాండ్ 10 శాతం మించే అవకాశాలు లేదని ఆయన స్పష్టంచేశారు. రిటైల్ విస్తరణ, అసంఘటిత విభాగం అధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్నదంటున్న ఆయన.. పెరుగుతున్న ధరల కారణంగా వినియోగం తగ్గుతున్నప్పటికీ, పండుగ సీజన్‌లో డిమాండ్ తగ్గే అవకాశాలు లేవని స్పష్టంచేశారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బంగారు ఆభరణాల వినిమయం విలువలో గణనీయమైన 28 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ఏడాది కూడా ఇదే తరహా పెరుగుదల ఉంటుందని పేర్కొంది.

### ధరలు పెరిగే అవకాశాలు తక్కువే..

ప్రస్తుతం కొనసాగుతున్న బంగారం ధరలు ఈ ఏడాది ఇదే స్థాయిలో కొనసాగే అవకాశాలున్నాయని ఇక్రా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అంతర్జాతీయంగా ఏదైనా అనిశ్చిత పరిస్థితులు నెలకొంటే తప్ప ధరల్లో పెద్దగా మార్పులు ఉండవని తెలిపింది.

### రూ.500 తగ్గిన తులం ధర

గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతో దేశీయ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.500 దిగొచ్చింది. దీంతో పదిగ్రాముల విలువ రూ.99 వేల దిగువకు రూ.98,500కి పడిపోయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే స్థాయిలో తగ్గి రూ.98 వేలుగా నమోదైంది. కానీ, వెండి ధరలు యథాతథంగా ఉన్నాయి. కిలో వెండి రూ.1,00,000గా ఉన్నది.



ధర రూ.88,942

## నయా జుపిటర్

న్యూఢిల్లీ, మే 29: ప్రముఖ వాహన సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..దేశీయ మార్కెట్లోకి అప్‌గ్రేడెడ్ చేసిన నయా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జూపిటర్ 125 డ్యూయల్ టోన్ స్మార్ట్‌కనెక్ట్‌ని పరిచయం చేసింది. ఈ స్కూటర్ ధర రూ.88,942గా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి.

### జావా యెజ్డీ షోరూం

జావా యెజ్డీ.. తాజాగా హైదరాబాద్‌లో మరో షోరూంను తెరిచింది. కంపెనీకి చెందిన వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం వల్లనే మరో షోరూంను ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

# ఆర్‌ఎంపీ వైద్యంతో మహిళ మృతి..?

- న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు
- కనగర్తి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి..

కోనరావుపేట, మే 29: ఆర్‌ఎంపీ వైద్యుడి చికిత్సతో ఓ మహిళ నిండు ప్రాణాలు కోల్పోయింది. జ్వరం వచ్చిందని ఆర్‌ఎంపీ వైద్యుడిని సంప్రదిస్తే తనకు తెలిసీ తెలియని వైద్యంతో మహిళ మృతికి కారకుడయ్యాడు. మహిళ అంత్యక్రియలు నిర్వహించిన తర్వాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. కాగా బాధితుడు పోలీసులకు న్యాయం చేయాలని కోరగా పెద్ద మనుషులు ఈ ఘటనను రహస్యంగా కప్పిపుచ్చారు. కానీ తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని భావించిన బాధితుడు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా బాధితుడు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన వివరాలిలా ఉన్నాయి. కోనరావుపేట మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన వంగపల్లి శంకర్ పొట్టకూటి కోసం సుద్దాల గ్రామంలోని పెట్రోల్ పంప్‌లో రోజువారిగా కూలీ పనిచేస్తూ కుటుంబ భారాన్ని వెల్లదీస్తున్నాడు. ఈక్రమంలో గత నెల ఏప్రిల్ 21న అతని భార్య అయిన వంగపల్లి రేణుక(32) అనారోగ్యం సమస్యలతో బాధపడుతుండగా, వైద్యం చేయాలని గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు ద్యావనపెల్లి లక్ష్మీనారాయణను కోరాడు. వెంటనే చికిత్స కోసం ఇంటికి వెళ్లాడు. పరీక్షించిన ఆర్‌ఎంపీ వైద్యుడు వెంటనే బలహీనంగా ఉందని గ్లూకోజ్ ఎక్కిచడంతోపాటు పలు ఇంజక్షన్‌లు ఇచ్చాడు. దీంతో రేణుక వాంతులు చేసుకుంటూ కింద పడిపోయింది. వెంటనే విరుగుడు కోసం ఆర్‌ఎంపీ ప్రయత్నించగా రేణుక పరిస్థితి విషమంగా మారింది. అనంతరం ఆర్‌ఎంపీ హడావుడి చేస్తూ హార్ట్ స్ట్రోక్ వచ్చిందని, అందులోని ఫిట్స్ వచ్చిందని చెప్పి అతడే స్వయంగా సిరిసిల్లలోని ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఎలాంటి చికిత్స చేశావని ఆర్‌ఎంపీని ప్రశ్నించగా ఏమీ వైద్యం చేయలేనని సమాధానం చెప్పి వైద్యులను తప్పుదోవ పట్టించాడు. దీంతో చికిత్స పొందుతూ రేణుక మృతి చెందగా కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. రేణుక మృతి చెందిన తర్వాత మరునాడు శంకర్ తన పిల్లలను ఏమి జరిగిందని అడుగగా ఆర్‌ఎంపీ వైద్యుడు లక్ష్మీనారాయణ గ్లూకోజ్ పెట్టడం, ఇంజక్షన్‌లు ఇచ్చాడని చెప్పారు. అప్పుడే తీవ్ర అస్వస్థతకు గురైందని మృతురాలి పిల్లలు చెప్పడంతో చికిత్స చేసిన వైద్యుడికి శంకర్ ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇలా రెండు రోజులు వేచి చూసి కోనరావుపేటలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐకి జరిగిన ఘటన వివరించగా, ఆర్‌ఎంపీ వైద్యుడు ఠాణాకు వెళ్లి తానేమీ వైద్యం చేయలేదని నిర్లక్ష్యపు సమాధానం చెప్పాడు. దీంతో పలువురు గ్రామపెద్ద మనుషులు అక్కడికి చేరుకొని ఇరువురితో మాట్లాడగా తాను వైద్యం చేయడం వల్లనే చనిపోయిందని ఆర్‌ఎంపీ ఒప్పుకున్నట్లు బాధితుడు తెలిపారు. దీంతో ఠాణాలో ఫిర్యాదు చేస్తానన్న పెద్దమనుషులు అడ్డుకున్నారని, ఇబ్బందులకు గురవుతావని బెదిరించారని బాధితుడు వాపోయాడు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకూడదని, తన భార్య మృతికి కారణమైన ఆర్‌ఎంపీ వైద్యుడు లక్ష్మణ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా గురువారం జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య పోగ్రాం అధికారులు, పోలీసులు కనగర్తి గ్రామంలో పర్యటించారు. సంఘటన జరిగిన తీరుపై గ్రామంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు క్లినిక్‌లో లేకపోవడంతో ఫోన్‌లో సంప్రదించినట్లు సమాచారం. గ్రామంలో సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

# విత్తనాలు, ఎరువుల ఎంపికలో జాగ్రత్త

- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

వేములవాడ రూరల్, మే 29 : వర్షకాలం పంట ప్రారంభమైయింది. సాగుకు సరిపడా వర్షాలు పడే అకాశం ఉండడంతో దుక్కి దున్ని సాగుకు అన్నదాత సిద్ధమయ్యాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అన్నదాత పొలం బాట పట్టారు. ఇంకా ధాన్యం కుప్పలు అలాగే ఉన్నా వర్షకాలం పంట సాగుకు అన్నదాత సిద్ధమయ్యాడు. విత్తనాలు, ఎరువులు, ఫర్టిలైజర్ మందుల కొనుగోళ్లలో రైతులు తలమునకలయ్యారు. ఇలాంటి సమయంలోనే అనుమతులు లేని కంపెనీ విత్తనాలు ఎరువులు కొని అన్నదాతలు నష్టపోతుంటారు. అలా నష్టపోయిన సంఘటనలు చాలా ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు విత్తనాలు, ఎరువులు ఎంపికలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఒకటికి రెండుసార్లు ఆలోచించి, అన్ని వివరాలు పరిశీలించిన తర్వాతనే కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. నకిలీ విత్తనాలపై అనుమానం ఉంటే అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఉంది.



ఫర్టిలైజర్ దుకాణాల్లోకి చేరిన పత్తి, వరి విత్తనాలు

### అనుమానం వస్తే సమాచారం ఇవ్వాలి



నకిలీ విత్తనాలు అనే అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలి. గ్రామాల్లోకి వచ్చే దళారుల వద్ద విడి విత్తనాలు కొనుగోలు చేసి అన్నదాత మోసపోవద్దు. బ్యాచ్ నంబర్లు లేని పురుగుల మందులు కొనుగోలు చేయవద్దు. అనుమతులు లేకుండా విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే తమకు సమాచారం అందించాలి. ఈమేరకు ఇప్పటికే డీలర్లుకు తగిన సూచనలు అందజేశాం.

**- సాయికిరణ్, వేములవాడ ఏవో**

**రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

- లైసెన్స్‌లేని దుకాణాలు, వ్యక్తుల దగ్గర కొనుగోలు చేయవద్దు.
- కొనుగోలు చేసిన వివరాలు, లాట్ నంబరు, తయారీ తేది, విత్తన రకం ఇలా అన్ని వివరాలు ఉండి, రసీదుపై దుకాణాదారుడి సంతకం చేసిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.
- సంచులపై సీలు విప్పినట్టు, తిరిగి కుట్టువేసినట్లు కనిపిస్తే అలాంటి వాటిని తీసుకోకూడదు.
- వ్యవసాయశాఖ అనుమతి పొందిన డీలర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి మాత్రమే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బస్తాతో ఉండే చీటి ఉందో లేదో గమనించాలి, ఆ చీటీని పంట కాలం అయ్యేంత వరకు భద్రంగా ఉంచుకోవాలి
- క్రిమిసంహారక మందుల డబ్బాలపై కంపెనీ పేరు తయారీ తేదీ, కాల పరిమితి గమనించి, అందుకు అనుగుణంగా బిల్లును తీసుకోవాలి
- ఏది ఎంత ధర కొన్నా డీలర్ లేదా దుకాణదారుడి సంతకంతో తప్పనిసరిగా బిల్లు పొందాలి

# పేద విద్యార్థినికి పెద్ద సాయం

- తండ్రి మరణంతో నిలిచిన చదువు
- ఉచిత విద్య అందించేందుకు ముందుకు వచ్చిన పాఠశాల యాజమాన్యం

చొప్పదండి, మే29: మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన చీకట్ల మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణిచంగా, కుటుంబ పెద్ద ఆకస్మిక మరణంతో పేదింటికి చెందిన ఆ కుటుంబంలో చీకట్లు అలుముకున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని ఆ ఇంటిలో పూట గడవడమే గగనం కాగా, తల్లి కూలీ పనులు చేస్తుండగా, పాఠశాలకు వెళ్లాల్సిన పిల్లలు ఇంటికే పరిమితమయ్యారు. తండ్రి మరణంతో అర్ధాంతరంగా చదువు ఆపేయటం తెలుసుకున్న అక్షయ పాఠశాల యాజమాన్యం బాలికకు నర్సరీ నుంచి 5వతరగతి వరకు ఉచిత విద్యను అందించేందుకు నిర్ణయిం చింది. ఈ మేరకు గురువారం ఆ బా లికకు ఉచిత ప్రవేశం కల్పిస్తూ పాఠశాల యాజమా న్యం ఉత్తర్వులు విడుదల చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన చీకట్ల మహేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. నిరుపేద వర్గానికి చెందిన ఆయన కూలీ నాలి చేస్తూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాడు. ప్రమాదంలో ఆయన మరణించడంతో కుటుంబ పోషణ భారంగా మారి, పిల్లల చదువులు నిలిచిపోయాయి.




ఉచితంగా విద్య అందిస్తామని ఉత్తర్వులను అందజేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ కనకరాజు

విషయం తెలుసుకున్న గ్రామంలోని అక్షయ పాఠశాల నిర్వాహకుడు తమ్ముడి కనకరాజు దివంగత మహేందర్ ఇం టికి వెళ్లి పెద్ద కూతురు సిరి చందనకు నర్సరీ నుంచి 5వతరగతి వరకు ఉచితంగా విద్య అందిస్తానని హామీ ఇచ్చాడు. ఇచ్చిన హామీ మేరకు గురువారం తన పాఠశాలలో ఆమెకు ప్రవేశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు. ఉచిత విద్యను అందిస్తూ తన ఉదారతను చాటుకున్న పాఠశాల కరస్పాండెంట్ కనకరాజును గ్రామస్తులు అభినందించారు.

# జమ్మికుంట కేంద్రంగా 'పాండు' దందా!

- నిబంధనలు విరుద్ధంగా తినుబండారాల తయారీ
- ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలో బట్టబయలు
- గతంలో టాస్క్‌ఫోర్స్ దాడులు
- ప్రజల ఆరోగ్యంతో చెలగామాడుతున్న కేంద్రంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



కేంద్రాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

జమ్మికుంట, మే 29 : జమ్మికుంట కేంద్రంగా 'పాండు స్వీట్స్.. కారా' దందా సాగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా తినుబండారాల తయారీ చేస్తున్నారు. పదార్థాల ఆకర్షణ కోసం రంగులు వేస్తూ.. వాడిన నూనెను తిరిగి వినియోగిస్తున్నారు. తయారీ కేంద్రంలో సిబ్బంది శుభ్రత పాటించకుండా పనిచేస్తున్నారు. ఈ తతంగమంతా ఇటీవల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్‌రెడ్డి తనిఖీల్లో బహిర్గతమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం సదరు కేంద్రం సీజ్ చేసిన ప్పకిటీ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి.

### ఏళ్లకాలంగా 'పాండు' దందా

నిర్వాహకుడు 'పాండు' పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడి, ఇక్కడి ప్రజలను ఆకర్షించే పనిలో పడ్డాడు. అందుకు అడ్డాగా మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిని ఎంచుకున్నాడు. తొలుత రకరకాల రంగులతో వేయించిన పిల్లల పాపడ్స్ తయారీ చేయడం ప్రారంభించాడు. అలా.. 'పాండు' ఫ్యాక్టరీనే స్థాపించాడు. నాసిరకం పిండి, వస్తువులతో స్వీట్లు, కారా, తదితర పధార్థాలు తయారు చేశాడు. గ్రామాల్లోని ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు తినేలా తినుబండారాలు సరఫరా చేస్తూ.. తన వ్యాపారాన్ని విస్తరించాడు. పదుల సంఖ్యలో కార్మికులతో తయారీ కేంద్రాన్ని నడిపిస్తున్నాడు. శుచి, శుభ్రత పాటించకుండా ఇష్టానుసారంగా పదార్థాలను తయారు చేయిస్తున్నాడు.

### గతంలోనూ దాడులు

పాండు తయారీ కేంద్రంపై అనేక ఆరోపణలున్నాయి. ఎన్నోసార్లు అధికారులకు పలువురు ఫిర్యాదులు చేశారని తెలిసింది. కానీ, ఆహార భద్రత అధికారుల సంఖ్య ఎక్కువ లేకపోవడం.. ఇంకొన్ని శాఖల అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకునే అవకాశాలున్నప్పటికీ.. 'మామూలు'గా తీసుకోవడంపై విమర్శలు వచ్చాయి. గతంలో ఇదే తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని నమూనాలు సేకరించుకుని వెళ్లారు. ఆ త ర్వాత నిర్వాహకుడిపై ఎలాంటి చర్యలూ చేపట్టక పోవడంతో.. తన దందాను య థావిధిగా కొనసాగిస్తున్నాడు. కొందరు ప్రశ్నించే ప్రయత్నం చేయగా, వారిని బెదిరింపుకు గురి చేయడమే కాకుండా దాడులు చేసేందుకు సిద్ధమయ్యాడని తెలిసింది.



'పాండు' కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఎఫ్‌ఎస్‌వో(ఫైల్)

### అధికారి ఆగ్రహం

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాండు స్వీట్స్-కారా కేంద్రాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారి అంకిత్‌రెడ్డి ఈ నెల 26న ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే తిను బండారాలకు వేస్తున్న రకరకాల రంగులు, రసాయన పధార్థాలు, అపరిశుభ్రతతో పరిసరాలు, శుభ్రత పాటించని సిబ్బంది, వాడిన ఆయిల్‌నే మళ్లీమళ్లీ వాడడం, ఇలా చెప్పుకుంటూ పోతే.. చూస్తేనే అసహ్యం వేసేలా తయారీ కళ్ల ముందు కనిపించడంతో అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. నమూనాలు తీసుకున్నారు. ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. కాగా, 'పాండు'కు ఓ వర్గం నాయకులతో పాటు మున్సిపల్ ఉద్యోగి అండగా నిలిచినట్లు ప్రచారం సాగుతున్నది. ఏదేమైనా పాండు దందాకు శాశ్వతంగా చెక్ పెట్టాలని సర్వత్రా డిమాండ్లున్నాయి.